# కష్టార్జితం

పరంధామయ్యగారు యెంతో జాగ్రత్తగల వ్యక్తి. ముఖ్యంగా మనీమేటర్స్‌లో యెప్పుడూ నిర్మొహమాటంగా వ్యవహరిస్తారు. ఒకరికి డబ్బు యిచ్చేటప్పుడు లేదా వొకరి వద్దనుంచి తను డబ్బు పుచ్చుకునేటప్పుడు నాలుగైదు పర్యాయాలు లెక్క పెట్టందే తృప్తి చెందరు.

అటువంటిది ఈరోజు ఆయన పర్స్ పోగొట్టుకున్నారు. పర్స్‌లో మూడువందలున్నాయి.

జరిగిందేమిటంటే పరంధామయ్యగారు ఉదయాన్నే జనతాలో దిగి స్టేషన్ నుండి గంటస్థంభం వరకూ రిక్షాలో వచ్చేరు. గంటస్థంభం వద్ద రిక్షాదిగి రిక్షావాడికి డబ్బులిచ్చేసి ఎదురుగా వున్న పళ్ల దుకాణంలో నాలుగు ఏపిల్‌పళ్ళు కొని చేతి సంచిలో వేసుకొన్నారు. తరవాత పువ్వుల దుకాణంలో ఓ అరవంద చేమంతి పువ్వులు కట్టించేరు. పువ్వుల దుకాణం వాడికి డబ్బులిద్దామని జేబులో చెయ్యి పెట్టేసరికి పర్స్‌లేదు ఆతృతతో అన్ని జేబులూ వేదికేరు. పర్స్ దొరకలేదు. ఎవరో కొట్టేశారు అనుకున్నారు.

"పరంధామయ్యగారికి ముచ్చెమటలు పోశాయి. పళ్ళ దుకాణం నుంచి, పువ్వుల దుకాణానికి వచ్చేలోపల పర్స్ ఎవరో కాజేశారు. పరంధామయ్యగారు జరిగిందానికెంతో విచారించేరు. అతని చేతిలో ఎన్నడూ చిల్లిగవ్వకూడా పోలేదు. అటువంటిదీ రోజు పర్స్‌తో పాటు మూడువందల రూపాయలు పోయేయి.

గంటస్థంభం ప్రాంతంలో ఎప్పుడూ రష్ జాస్తీగానే ఉంటుంది. అందులో ఆదివారంనాడు ఆవూర్లో సంత జరుగుతుంది. జనం విపరీతంగా వుంటారు. ఆదివారం నాడు పెద్దబజార్లోకి వెళ్లడం చాలా కష్టం. ఏమాత్రం ఏమరుపాటున వున్నా పోకెట్స్ గల్లంతే.

పువ్వుల వాడికివ్వడానికి మరి అతని వద్ద డబ్బుల్లేనందువల్ల పువ్వులు వాపస్ చేసి అర ఫర్లాంగు దూరంలో వున్న టూటౌన్ పోలీసు స్టేషన్‌కి వెళ్ళేరు రిపోర్టిద్దామని.

వెంటనే పోలీస్ రిపోర్టిస్తే ఏమైనా లాభం వుంటుందనే ఆశతో నేరుగా సి.ఐ. దగ్గరకు వెళ్లి

నమస్కరించి తన పర్స్ పోయిన విషయం చెప్పారు పరంధామయ్యగారు.

సి.ఐ. గారు ఓమారు ముఖం చిట్లించి "తెల్లారేసరికి పిక్‌పాకెట్" కేసేమిటని విసుక్కుని ప్రక్కనే వున్న యస్.ఐ గారితో.

"అదేవిటో కాస్త చూడవోయ్ మూర్తి" అన్నారు.

యస్సై మూర్తిగారు పరంధామయ్యగార్ని తన రూంలోకి తీసుకెళ్లేరు.

"చెప్పండి" అన్నారు.

పరంధామయ్యగారు జరిగిందంతా చెప్పేరు.

"సార్! తమరు వెంటనే ఎవరినైనా పంపిస్తే దొంగ పరిసర ప్రాంతాలు దాటి పోకుండా పట్టుకోవచ్చు." అన్నారు ఆతృతతో.

యస్సైగారు మాత్రం తొందరపడలేదు. అతనికి యిటువంటి చిల్లర తొంగతనాలు ఇన్‌వెస్టిగేట్ చెయ్యడమంటే ఎలర్జీ. అందుచేత హెడ్‌కానిస్టేబుల్ ఏడుకొండలు వస్తే అతనికి ఈకేస్ ఒప్పగించాలనుకుంటున్నారు.

తను రిపోర్టిచ్చి పావుగంటైనా ఎవరూ సరియైన యాక్షన్ తీసుకోనందుకు పరంధామయ్యగారికి కోపం వచ్చింది.

"మీఫోన్ ఓపర్యాయం వాడుకుంటా" అని రిసీవర్ ఎత్తి నంబర్ డైల్ చేశారు.

అవతలవేపు తనకు కావల్సిన వ్యక్తి గొంతుక విన్పించగానే సంతోషించి -

"నేను పరంధామయ్యను..... మీటూటౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి మాట్లాడుతున్నా...... ఉదయం జనతాలో వచ్చేను. నువ్వు అర్జంటుగా ఇక్కడకురా అన్ని విషయాలు మాట్లాడుకుందాం....' అంటూ ఫోన్ పెట్టేశారు.

మరోపదినిముషాల్లో యస్.పి. రాజశేఖరంగారి కారువచ్చి పోలీస్‌స్టేషన్‌లో ఆగింది. యస్.పి. గార్ని చూడగానే పోలీస్ స్టేషన్ ఒక్క మారు చైతన్యం చెందింది. సి.ఐ.గారు యస్సైగారు యస్.పి.గారి దగ్గరకు వచ్చి సెల్యూట్ చేసారు.

యస్.పి.గారు నేరుగా స్టేషన్‌లోకి వచ్చి యస్సైరూంలో బెంచీ మీద కూర్చున్న పరంధామయ్యగార్ని చూసి.

"ఏమిటి బాబాయ్ ! ఏం జరిగింది. ఇక్కడెందుకున్నావ్?" అన్నారు ఆశ్చర్యంతో.

పరంధామయ్యగారు యస్.పిగారి చిన్నాన్నగారని తెలియగానే యస్సైగారు, సి.ఐ.గారు నిర్ఘాంతపోయారు.

"మరేంలేదుసార్! అయ్యగారి పర్స్‌మార్కెట్‌లో పిక్‌పాకెట్ చేసేరుట. రిపోర్టిద్దామని వచ్చేరుసార్! మన యస్సై మూర్తిగారు కేస్ టేకప్ చేసేరుసార్! వెంటనే రికవర్ చేసేస్తాం సార్!' ' అన్నారు సి,ఐ.గారు తడబడుతూ.

యస్సై మూర్తిగారు ఇద్దరు కానిస్టేబుల్స్‌ని తీసుకొని బయటకు పరిగెత్తారు.

"ఓకె. మేం యింటికి వెళ్తున్నాం. ఓగంటలో నాకు పొజిషన్ యింటికి ఫోన్ చేసి చెప్పండి' 'అని. పదబాబాయ్ " అంటూ పరంధామయ్యగార్ని తీసుకొని వెళ్లిపోయారు యస్.పి రాజశేఖరంగారు.

యస్.పి రాజశేఖరంగారు పరంధామయ్యగారి అన్నకుమారుడు. రాజశేఖరంగారు రెండుమాసాల క్రితం నెల్లూరు నుంచి ట్రాన్స్‌ఫరై వచ్చేరు. రాజశేఖరంగార్ని, పిల్లల్ని ఓపర్యాయం చూసిపోదామని పరంధామయ్యగారు వచ్చేరు.

రాజశేఖరంగారు, పరంధామయ్యగారు ఇంటికి వచ్చిన మరో అరగంటకు ఎస్సైమూర్తిగారు వచ్చి యస్.పి గారికి సెల్యూట్ చేశారు.

"మనీ రికవర్ చేసేసేను సార్! ఇదుగో"అంటూ మూడువందల రూపాయల నోట్లు యస్.పి దొరగారి ముందుంచి !

"సార్! పర్స్ మాత్రం దొరకలేదు సార్ వాడు పర్స్‌లో డబ్బు తీసి ఖాళీ పర్సును తగలబెట్టేశాడుట" అంటూ యింకా ఏమో చెప్పబోయేరు యస్సైగారు.

" దట్సాల్‌రైట్! యుకెన్‌గో!" అన్నారు. యస్.పిగారు.

"యస్సార్! అంటూ మరొక మారు సెల్యూట్ చేసి వెళ్ళిపోయారు యస్సైగారు.

పరంధామయ్యగారు పోయిన డబ్బు తిరిగి దొరికినందుకు ఎంతో సంతోషించేరు. "కష్టార్జితం ఎక్కడికీపోదు." అనుకున్నారు.

"స్నానానికి వేడినీళ్లు సిద్ధంచేసేనని బోయ్ చెప్పడంతో పరంధామయ్యగారు టవల్ కోసం చేతి సంచీ తీసేరు. అందులో టవల్ ఏపిల్ పళ్ళతోబాటు అతని పర్స్ కూడా కన్పించేసరికి ఎంతో ఆశ్చర్యపోయేరు.

"ఇంతకూ తన పర్స్‌పోలేదన్న మాట! ఏపిల్ పళ్లతోపాటు తనే దాన్ని పొరపాటున చేతిపంచిలో పడవేసి వుండాలి.

అయినా కష్టార్జితం ఎలా పోతుంది.?" అని మరొకమారు తనను తాను సమాధాన పర్చుకున్నారు పరంధామయ్యగారు.

"మరి యస్సైగారు రికవర్ చేసి యిచ్చిన మూడువందలూ ఎవరి కష్టార్జితమో!"

**(ఆంధ్రజ్యోతి వారపత్రిక 20-4-79)** ✪